# 6

# నేను-జానకీ-జాకీ

సెల్‌ఫోన్ మోతకి మెలకువ వచ్చింది. లేచి కళ్ళజోడు పెట్టుకుని చూశా. నా గుండె గుభేలుమంది. మరీ తెల్లవారు ఝామునే లేచి కూర్చున్నట్లున్నాడు. నాలుగు మిస్‌డ్ కాల్స్ ఉన్నాయి. దాన్నక్కడ పారేసి గదిలోంచి పరిగెట్టాను.

మా శాల్తీ వంటింట్లో లేదు. "జానకీ జానకీ" అంటూ ఇల్లంతా వెతికా. పెరట్లో దొరికింది. "శ్రీ సూర్యనారాయణా మేలుకో హరి సూర్యనారాయణా" అని పాడుకుంటూ పువ్వులు కోస్తోంది. "ఇప్పుడేం ఖర్మం, ఎప్పుడో మేలుకున్నాడు, వచ్చేస్తున్నాడు. నువ్వు బెడ్‌రూమ్‌లోకి పద" అని లాక్కెళ్ళి మంచంమీద కుదేశాను.

"పడుకో. నీకు జ్వరం, మలేరియా! కాదు కాదు చికున్‌గున్యా. ఇంకా వారం దాకా మంచం దిగవు. సరేనా. బుర్రకెక్కిందా. ఇంతకన్నా ఇప్పుడు వివరంగా చెప్పి చావలేను" అని పడుకోబెట్టి ఓ దుప్పటి కప్పాను.

"ఎందుకండీ ఇదంతా?" అంది.

"సూర్యనారాయణ వస్తున్నాడు".

"సూర్యనారాయణంటే హోమియో డాక్టరుగారా?"

"కాదు, మన వియ్యంకుడుగారు వస్తున్నాడు. నీకు జ్వరం అని చెప్పి పంపించేద్దాం!"

"అలా చేస్తే బావుండదేమోనండీ!" అంది.

"భేషుగ్గా ఉంటుంది. శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలు. నువ్వు మాత్రం పడుకో. చేతనైతే అమ్మో, అయ్యో అని మూలుగు, లేకపోతే నోరుమూసుకో".

"సరే మరి! మీ ఇష్టం, కూర చేసేశాను. పిండి తడిపేశాను. వాళ్ళు రాగానే పూరీలు వేయిద్దామనుకున్నా. నన్ను మంచం దిగద్దన్నారుగా. మరి ఆ పని మీరు చూసుకోండి" అంది పడుకుని, దుప్పటి తిన్నగా కప్పుకుంటూ.

నాకు బుర్ర తిరిగిపోయింది. "అంటే వాళ్ళొస్తున్నారని ముందే తెలుసా నీకు?" అడిగాను.

"పొద్దున్నే ఫోన్ చేశారుగా!" నాక్కోపం వచ్చింది. "మరి ఈ మాట ముందే చెప్పేడవచ్చుగా" అన్నాను.

"ఇప్పుడేగా మీరు నిద్ర లేచారూ! ఎప్పుడు చెప్పేడవను?" అంది. మేమిలా వాదించుకుంటూ ఉండగానే బయట కారాగిన శబ్దం వినిపించింది.

"అదుగో వాళ్ళొచ్చారు. నాకిప్పుడు జ్వరం వచ్చింది కదా. మీరే వెళ్ళి పలుకరించండి" అంది.

ఇదో అయోమయం మేళం. "అంతా అయిపోయాక ఇంకెందుకీ నాటకాలు నీ బొంద" అని బాత్‌రూమ్‌లోకి దూరిపోయా. తీరిగ్గా స్నానం చేసి నిదానంగా తయారై హాల్లోకి వెళ్ళాను. ఎదురుగా సోఫాలో సూర్యనారాయణా, పక్కన ఉషాదేవి గారూ. వాళ్ళిద్దరి మధ్యా జాకీ.

ఎదురుగా కుర్చీలో చిద్విలాసంగా మా జానకీ. ఆహా చూడటానికి అది ఎంత మనోహరమైన దృశ్యం!

"రండి బావగారూ! కూర్చోండి" అన్నాడు. నా ఇంట్లో నాకెవరైనా మర్యాదలు చేస్తే చిరాగ్గా ఉంటుంది.

"నమస్కారం అన్నయ్యగారూ! బావున్నారా?" అందావిడ. ఆ వరసలేమిటో నాకిప్పటికీ అర్థంకావు.

భార్యని చూపించి మీ అక్కయ్యగారు అంటాడాయన. ఆవిడేమో అన్నయ్యగారూ అంటుంది.

"మీ ఇల్లు మా జాకీకి బాగా అలవాటైపోయింది అన్నయ్యగారూ! వచ్చీ రాగానే కుషన్లు కింద పారేసి ఎంత దర్జాగా కూర్చుందో!" అని జాకీ మెడ నిమురుతూ

మురిసిపోయింది. అవునమ్మా యథా యజమానీ తథా కుక్క. మీ ఆయన లేదూ చనువుగా, నా ఇంట్లో నాకే మర్యాదలు చేసేస్తూ అనుకున్నా.

"నిలబడే ఉన్నారేం బావగారూ, కూర్చోండి. కాఫీ తాగుతారా?" అన్నాడు సూర్యనారాయణ.

ఈయన వచ్చిన ప్రతిసారీ ఇది నా ఇల్లా ఆయనిల్లా అని అయోమయంగా ఉంటుంది నాకు. తట్టుకోలేను. అందుకే "నాకు కాస్త పనుంది. వెళ్ళాలి" అన్నా.

"మేము ఊరెళ్తున్నాం బావగారూ!" అంటూ చెప్పబోతే వారించాను. "అవన్నీ మా జానకీతో ఎలాగూ చెప్తారుగా. నేనువెళ్తా" అని చల్లగా జారుకున్నా. అటు చివరగా కట్టివున్న మా టామీ గొంతు చించుకుని అరుస్తోంది. అవును మరి తను ఇంటికి కాపలా ఉండగా ఇంకో కుక్క ఇంట్లో దూరిపోతే దానికొళ్ళుమండదూ!

నన్ను చూడగానే అరుపు ఆపేసి, తోకాడిస్తూ మొఱ్రో మని మొత్తుకుంది. దాని దగ్గరికి వెళ్ళి తల నిమిరాను. ఊరుకో నువ్వూ, నేనూ ఎంత మొరిగినా ఏవిటి లాభం అన్నాను ఓదార్పుగా. నా బాధ అర్థం చేసుకుని సణుక్కుంటూనే వెళ్ళిపోయి పడుకుంది టామీ.

నేను చెప్పులేసుకుని రోడ్డెక్కాను. పక్కనే ఉన్న సాయిబాబా గుడికి వెళ్ళాను. ఆయనెదురుగా కూర్చుని "సాయినాథా ఏవిటి నాకీ బాధ" అనుకున్నా.

నా బాధ వెనక బోలెడంత గాథ ఉంది. నాకు యాభై దాటాయి. ఉద్యోగం, స్వంత ఇల్లు, తగుమాత్రం ఆస్తి, ఆజ్ఞానుసారిణి అయిన భార్య, రత్నమాణిక్యాల్లాంటి ఇద్దరు పిల్లలు ఉన్నారు. నిరుడు ఈ రోజుల్లోనే పెద్దవాడికి పెళ్ళిచేసేశా. ఆ పిల్ల మేలిమి బంగారం.

మంచి కుటుంబం నించీ వచ్చింది. పెళ్ళయిన మూడు నెలలకే మావాడిని కంపెనీవాళ్ళు అమెరికా వెళ్ళమన్నారు. భార్యని తీసుకుని ఝూమ్మని వెళ్ళిపోయాడు.

రెండోవాడు రెండేళ్ళ కిందటే ఆస్ట్రేలియా వెళ్ళాడు. ఇక నేనూ, జానకీ నిశ్చింతగా ఉందాం అనుకున్నా. కానీ అనుకోకుండా అస్తవ్యస్తమైపోయింది నా జీవితం.

మా పిల్లలు అమెరికా వెళ్ళిన వారం రోజులకి మా వియ్యాలవారు మా ఇంటికొచ్చారు. ముందు ఫోన్ చేసే వచ్చారు. కాసేపు మాట్లాడుకున్నాక– "బావగారూ మీరు నాకో సాయం చెయ్యాలి" అన్నాడు.

"అయ్యో, ఎంత మాట చెప్పండి" అన్నాను, అరక్షణం ఆలస్యం చెయ్యకుండా. చెప్పేడు. వాళ్ళు మొక్కు తీర్చుకునేందుకు తిరుపతి వెళ్తున్నారు. వాళ్ళింట్లో ఓ బుజ్జి కుక్కపిల్ల ఉంది. దాన్ని చూసుకునేందుకు ఎవరూ లేరు. ఆ నాల్రోజులూ మా జాకీని మీ ఇంట్లో ఉంచి వెళ్తాం, మొహమాటంగానే అడిగాడు. "దానికేం ఉంచండి. మాకు కుక్కల పెంపకం అలవాటే" అన్నాను.

మర్నాడే కుక్కని తీసుకొచ్చారు. తెల్లగా ఊలుబంతిలా ముద్దొస్తోంది జాకీ. దాని ఆహార వ్యవహారాలన్నీ కాయితం మీద రాసిచ్చారుట. దాన్ని భద్రంగా వంటింట్లో అలమార తలుపుకి అంటించింది జానకి. భలే ముద్దుగా ఉందని మురిసి పోయాం మేమిద్దరం.

మా టామీ మాత్రం కుక్కబుద్ధి చూపిస్తూ ఎద్దంత గొంతేసుకుని అరవటం మొదలుపెట్టింది. జాకీ కూడా ఎదురు తిరిగి అరవటం మొదలుపెట్టిది. నేను రెండింటినీ కోప్పడ్డాను. టామీ వూరుకుంది గానీ జాకీ మాత్రం నా మాట వినలేదు. మాకు కుక్కలతో వేగటం కొత్తేంకాదు. ఆస్తిపంపకాల సమయంలో నా వాటాకి మా టామీ వచ్చింది.

మా ఇంటికొచ్చేసరికే దాని వయసు అయిదేళ్ళు. మంచీ మర్యాదా తెలుసు. పద్ధతిగా ప్రవర్తించేది. మా వియ్యాలవారి జాకీ బొత్తిగా పిల్ల.

ముందే ఏమీ తెలీదు. ఆపైన అమిత గారాబంచేసి చెడగొట్టారు. చెప్పిన మాట వినదు. రాత్రిపూట మాత్రమే గొలుసుతో కట్టాలి దాన్ని. పగలంతా గాలికి వదిలెయ్యాలి. అదున్న ఆ నాలుగు రోజులూ మమ్మల్ని ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగించింది.

సూర్యనారాయణ ఉషాదేవిగారు ఊళ్ళోకొచ్చారు. సాయంత్రం వచ్చి జాకీని తీసుకెళ్తామన్నారు. మా జానకికి వల్లమాలిన బంధుప్రేమ. ఇంటికెవరొచ్చినా వట్టి చేతుల్తో పంపదు. నాదీ అదే పద్ధతి. మనుషులకైతే బట్టలోపాత్రలో పెడతాం. మరి కుక్కపిల్లకి ఏంపెట్టాలి? "వెండిగిన్నె కొందాం, పాలుతాగుతుంది" అంది జానకి.

కొనచ్చు, కానీ వెండి మండిపోతోంది. కొన్లేం. మా అబ్బాయి పెళ్ళయ్యాక మొదటిసారి ఇంటికొచ్చిన వియ్యాలవారి కుక్కని వట్టి కాళ్ళతో పంపితే ఏం బావుంటుందీ? కాసేపు తర్జనభర్జనపడి చివరికి దానికోసం కొత్త గొలుసూ, మెడపట్టీ కొన్నాను. అలా కొంటున్న సమయంలో మా టామీ దీనవదనం గుర్తొచ్చింది.

పాపం ఆరేళ్ళుగా ఆ పాత గొలుసుతోనే అఘోరిస్తోంది. అందుకని దానికీ ఒకటి కొన్నాను. ఆ రాత్రి వియ్యాలవారొచ్చారు. వాళ్ళని చూడగానే బోలెడంత సంబరపడింది జాకీ. కానీ వెళ్ళబోయేముందు కుయ్ కుయ్‌మంటూ ఇల్లంతా తిరిగి మా ఇద్దరికాళ్ళూ నాకి కారెక్కింది.

కారువెళ్ళాక జానకి కళ్ళ నీళ్ళు పెట్టుకుంది. "పరాయి కుక్కపిల్ల మనింట్లో ఎన్నాళ్ళుంటుందీ? వాళ్ళింటికి వెళ్ళాలిగా. నువ్వేడవకు. మళ్ళీ వస్తుందిలే అని ఓదార్చాను. అదుగో ఆ మాటే నా కొంప ముంచింది. పైనించీ తథాస్తు దేవతలు ఆలస్యం చేయకుండా తథాస్తనేశారు.

వారం తిరక్కుండానే సూర్యనారాయణ ఫోన్ చేశాడు. శ్రీశైలం వెళ్తున్నారట. షరా మామూలే. జాకీని మా ఇంట్లో దించివెళ్ళి రెండ్రోజుల తర్వాత వచ్చి ప్రసాదం ఇచ్చి కుక్క పిల్లని తీసుకెళ్ళారు.

ఇక అదే అలవాటైపోయింది. వాళ్ళ అమ్మాయికి మంచి సంబంధం రావాలని బోలెడన్ని మొక్కులు మొక్కారట. దివ్యమైన సంబంధం కుదిరింది కాబట్టి మొక్కులు వరసగా తీర్చుకుంటున్నాం అన్నారు. వాళ్ళు మాకు ఆ కితాబు ఇవ్వడం వరకూ ఓ.కే. భేషుగ్గా ఉంది.

ఆ కుక్కగోలే ఎక్కువై పోయింది. చనువెక్కువై పోయింది దానికి. అటు సూర్యనారాయణకీ చనువు ఎక్కువైపోయింది.

అదివరకు మీరూళ్ళో ఉంటారా! అని అడిగిమరీ కుక్కని దించేవాడు. ఆ తరువాత దించేస్తున్నాం, మీ అక్కగారు కుక్కని తీస్కుని వచ్చేస్తున్నారు అనేవాడు. అటుపిమ్మట ఏకంగా తీసుకొచ్చి దించేసి ఫలానా ఊరికెళ్తున్నాం అని చెప్పి వెళ్ళిపోవటం, తిరిగొచ్చి ప్రసాదం ఇచ్చి జాకీని తీసుకుపోవటం. మొదట్లో ముద్దుగా అన్ని పనులూ తానే చేసిన జానకి ఆ తర్వాత ఆ బాధ్యత నా నెత్తిన పెట్టింది.

దాన్ని రెండుపూట్లా షికారుకి తీసుకెళ్ళడం, బంతాడించటం, అది అందరినీ కరవబోతుంటే వాళ్ళందరికీ సారీ చెప్పటం వగైరాలన్నీ నేనే చెయ్యాల్సి వచ్చింది.

అదే అలుసుగా తీసుకుని అటు సూర్యనారాయణ కూడా విజృంభించేశాడు. "బావగారూ దానికివ్వాళ స్నానం చేయించాలి. నేనూరికెళ్తున్నాగా! మీరే రెండు చెంబుల నీళ్ళు పోసెయ్యండి. దానికి ఇంజక్షన్ డ్యూ. దాన్ని వెటర్నరీ డాక్టరు దగ్గరికి తీసుకెళ్ళి ఇంజక్షనిప్పించెయ్యండి" అని అలవోకగా పురమాయించేస్తున్నాడు.

కానీ ఇంత చేసినా జాకీకి ఇసుమంతైనా విశ్వాసం లేదు. ముందే అల్లరిది. దానికితోడు ఆర్నెల్లుగా జానకి సావాసం. ఇక చెప్పేది ఏముంది? నన్ను గడ్డిపోచలా తీసిపారేస్తుంది. నేను పేపరు చదువుకుంటూ ఉంటే లాక్కుని చించి పోగులు పెడుతుంది.

టీవీ రిమోట్ ఎక్కడో దాచేస్తుంది. నా మానాన నేను కూర్చుంటే అటొచ్చీ ఇటొచ్చీ ఉత్తి పుణ్యానికి నా మీద అరిచిపోతుంది. అవన్నీ అలా ఉంచి, నాతోబాటే డైనింగ్ టేబుల్‌మీద కూర్చుని ఆహారం స్వీకరిస్తుంది. ఓ రోజు చిటికెలో పెద్ద ప్రమాదం తప్పింది. పొద్దున్నే బ్రేక్‌ఫాస్ట్ తిందామని ఎదురుగా ఉన్న బౌల్ ముందుకి లాక్కుని నోట్లో పెట్టుకోబోతుంటే పరుగున వచ్చింది జానకి.

"అయ్యో! అయ్యో! జాకీ టిఫెన్ మీరు తింటారేమిటీ?" అని ఆపేసింది. నాకు బుర్ర తిరిగిపోయింది. "ఇది దాని టిఫెనా? నేనింకా అటుకుల ఉప్మా అనుకున్నా!" అనేశా.

"ఇంకా నయం. అది దాని టిఫెను. మీ కోసం మీ ఉప్మా చేశాను" అంది. నాకు చిరాకేసింది.

"అవును జానకీ. మా ఇద్దరినీ ఇలా ఒకే బంతిన కూర్చోబెట్టి వడ్డించటం అవసరమా? ఇద్దరికీ విడివిడిగా తగలెయ్యొచ్చు కదా!" అన్నాను. "అదలా విడిగా పెడితే తినదు. యజమాని బంతిన కూర్చుని తినడమే దానికలవాటు. వాళ్ళింట్లో కూడా ఇదీ, అన్నయ్యగారూ కలిసే తింటారుట" అంది. అంతటితో ఆగినా బావుండేది.

"దాని పక్కన కూర్చుని తినడానికి ఏవిటీ కష్టం? దాని ఫుడ్ ఏదో దానికి తెలుసు. మీరే కాస్త జాగ్రత్తగా ఉంటే సరిపోతుంది. అంటే అన్నానంటారుగానీ మనిషి

తిండికీ, కుక్క తిండికీ ఆ మాత్రం తేడా కూడా తెలీదా! అయోమయం కాకపోతేనూ!" అని కూడా అంది.

నాకేం తెలుసు? మా టామీ మాతోబాటే కందిపచ్చడీ, వంకాయకూరా వేసుకుని అన్నం తింటుంది. కుక్కలకి వేరే ఫుడ్ ఉంటుందని నాకు తెలీదు. అటు నా పట్ల విశ్వాసంగా ఉండే టామీలో మార్పు వచ్చింది. ఇంతకాలం అనవసరంగా గౌరవం ఇచ్చాను నీకు, అని అదికూడా అసహనం ప్రదర్శించింది.

ఇక సూర్యనారాయణ తోక ఝాడించేశాడు. ఏ పని మీద పొరుగూరెళ్ళినా కుక్కని మా ఇంట్లో వదిలి వెళ్ళిపోతున్నాడు. పెళ్ళిళ్ళు, పేరంటాలు ఒకటేమిటి, దర్జాగా వెళ్ళిపోతున్నాడు.

అదివరకు ఎక్కడికీ వెళ్ళడానికి వీలు అయ్యేది కాదు. మా అమ్మాయి పెళ్ళయ్యాక మా ప్రాణానికి సుఖంగా ఉంది అంటున్నాడు చిద్విలాసంగా. పిల్లికి చెలగాటం, ఎలక్కి ప్రాణ సంకటమంటే ఇదే మరి.

ఇలా లాభం లేదని మా వాడికి ఫోన్ చేసి "ఏవిట్రా మరీ! ఈ కుక్కపిల్లని మీ ఆవిడ ఎంతో మనసుపడి కొనుక్కుందిటగా! దీనికి కూడా వీసా ఇప్పించి అమెరికా పిలిపించుకో! అక్కడే పడుంటుందీ?" అన్నా.

"ఏవిటీ కుక్కపిల్లని అమెరికా పిలిపించుకోవాలా? ఇంకా నయం. ఇక్కడ పెంపుడు జంతువుల్ని పెంచుకోడం చాలా ఖర్చుతో కూడిన పని. కావలిస్తే మీరు రండి. పేపర్లు పంపిస్తా" అన్నాడు వాడు.

నాకు చిర్రెత్తుకొచ్చింది. "కుక్కని పిలిపించుకోమన్నాను. వీల్లేకపోతే వీల్లేదని చెప్పు. అంతేగానీ, దాని బదులు నన్ను రమ్మంటావేమిట్రా? ఒళ్ళు పొగరెక్కిందా ఏం?" అని బాగానే కోప్పడ్డా నేను.

"ఊరికే మాటవరసకి అన్నాను. లైట్ తీస్కోండి" అన్నాడు వాడు. కొడుకు ఆశ కూడా తీరిపోయాక వేరే మార్గాలు ఆలోచించా. వియ్యంకుడికే ఏదో మాయమాటలు చెప్పి తప్పించుకుందాం అనుకున్నా.

ఓ రోజు ఆయన ఫోన్ చేసి బావగారూ ఇంట్లో ఉన్నారా? అనగానే క్షణం ఆలస్యం చెయ్యకుండా" లేం, బెజవాడ వెళ్తున్నాం. సూర్యాపేట దాటేశాం" అని చెప్తూనే ఉన్నా మా ఇంటివరండాలో నిలబడి! గేటు తీసుకుని ఆయనొచ్చేశాడు.

ఏమో అనుకున్నా, మా బావగారికి మాంచి సెన్సాఫ్ హ్యూమరుంది అని మెచ్చుకున్నాడు.

అలా రెండు మూడుసార్లు మంచి మంచి ప్లాన్లేశాను గానీ అట్టర్ ఫ్లాప్. నాకంటే నాలుగాకులు ఎక్కువ చదువుకున్నాడు. నేను తనని ఎవాయిడ్ చెయ్యడానికి ట్రై చేస్తున్నానని గ్రహించి తనే నన్ను పక్కన పడేసి నేరుగా జానకితోనే మాట్లాడేస్తున్నాడు. మరీ ఏడిచిపోతానని అన్నీ నిర్ణయించుకున్నాక నాతో ఓ మాట చెప్తున్నారు.

పూజారిగారు భుజం తట్టేసరికి ఇహలోకంలోకి వచ్చాను. "ఏవిటిసార్ ఈ మధ్య మీకు భక్తి బాగా ఎక్కువైనట్లు ఉందే" అన్నాడు. "భక్తి కాదు నాయనా, వైరాగ్యం" అని చెప్పి ఇంటికొచ్చాను. వాళ్ళప్పుడే కారెక్కారు.

"వచ్చారా బావగారూ, పూరీలు బావున్నాయి. కూర అద్భుతంగా ఉంది. మీరు కానిచ్చెయ్యండి" అన్నాడు. "అలాగే. మీరు చెప్పాక ఇక తిరుగేముంది" అన్నాను. కారెళ్ళిపోయినా టాటా చెప్తున్నారు జాకీ, జానకీ, "ఇక చాలు పద" అన్నాను నేను.

"యాగంటి వెళ్ళారు. ఎల్లుండొస్తారు" అంది జానకి. "ఏ రాయి అయితేనేం పళ్ళు రాలగొట్టుకునేందుకు?"

లోపలికి రాగానే మా ఇద్దరికీ టిఫెన్ పెట్టింది జానకి. ఇదేవిటీ దీనికి వాళ్ళతో పెట్టకపోయావా అంటే, పిలిచినా అక్కడికి రాలేదుట. తినలేదుట.

"మిమ్మల్ని చూడగానే చెంగున వచ్చేసింది. ఎలాగైనా మీరంటే దానికి ప్రేమ" అంది మురిసిపోతూ.

అది నా అదృష్టం అన్నాను.

ఆఫీసుకి వెళ్దామని నిన్న తెచ్చుకున్న కాయితాల కోసం ఎంత వెదికినా కనిపించక విసుగేసి జానకిని కేకేసి అడిగాను. తనూ వెదికింది. "జాకీగానీ ఆడుకుందుకు తీసుకెళ్ళిందేమోనండీ!" అంది. "అదేవిటీ, ఆఫీసు కాయితాలతో ఆటలేవిటీ?" అన్నాను.

"ఆఫీసు కాయితాలేవో, పేపరు కాయితాలేవో దానికి తెలుసా! కుక్కపిల్ల ఇంట్లో ఉండగా మీ వస్తువులు జాగ్రత్తగా పెట్టుకోవద్దా! ఆ మాత్రం తెలియదా! అయోమయం మేళం ఎక్కడో" అని విసుక్కుంది.

నాకు చిర్రెత్తుకొచ్చింది. "ఆ కుక్కపిల్ల వెధవపన్లు చెయ్యటం నువ్వు దాన్ని వెనకేసుకొచ్చి మాటి మాటికీ నన్ను అయోమయం మేళం అనటం ఏమిటిదంతా? ఇహ నావల్లకాదు. ఈ ఇంట్లో అదైనా ఉండాలి, నేనైనా ఉండాలి. నువ్వేం చెప్తావో వాళ్ళకి" అని కరాఖండితంగా చెప్పేశాను. మరి ఈవిడేం చెప్పిందో వారం రోజులైనా సూర్యనారాయణ, కుక్కపిల్లా అడ్రెస్ లేరు.

హమ్మయ్య అనుకున్నా, ఆ వేళ మామూలుగా ఇంటి కొచ్చేసరికి తాళం వేసుంది. ఇల్లు కదిలి ఎక్కడికీ పోదే ఈ శాల్తీ అనుకుంటూ ఉండగానే ఎదురింటి పిల్ల వచ్చి తాళం చెవులు ఇచ్చింది. ఆంటీ కార్లో ఎక్కడికో వెళ్ళింది అంది. తాళం తీసుకుని లోపలికి వెళ్ళా.

హాల్లో సెంటర్ టేబుల్‌మీద ఓ చిన్న చీటీ.

ప్రియమైన మీకు!

అన్నయ్యగారు ఊరెళ్తున్నారుట. జాకీని తీసుకొచ్చారు. మీకిష్టం లేదనీ, వద్దన్నారనీ ఖచ్చితంగా చెప్పేశా. ఎలాగైనా అన్నయ్యగారు భలే తెలివిగలవారు. మాంచి ఐడియా వచ్చింది ఆయనకి. అయితే మీరే రండమ్మా మా ఇంటికీ, జాకీకి తోడుగా అక్కడే ఉండండి అన్నారు.

ఈ ఆలోచన బావుంది కదా ఉభయతారకంగా.

అందుకే నేనే వెళ్తున్నా. ఆవలెల్లుండి వస్తా. మీరు జాగ్రత్త.

ఇట్లు

మీ జానకి ❑

*స్వాతి సపరివారపత్రిక, 27 ఏప్రిల్ 2012*